క్లుప్తంగా

ఉచితంగా వైద్య పరీక్షలు

మేళ్లమర్రు(మోపిదేవి): గ్రామాల్లో అసంక్రమిత వ్యాధులు గుర్తించేందుకు వైద్య శిబిరాలు చేపట్టినట్లు పెదకళ్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యులు డాక్టర్ నంబూరి శ్రీరామ సాయి తెలిపారు. డాక్టర్ శ్రీరామ సాయి మాట్లాడారు. సర్పంచ్ అరజా సంధ్యారాణి, ఉప సర్పంచ్ అడపా దుర్గాప్రసాద్, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీఎస్, హెల్త్ అసిస్టెంట్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గూడూరు: స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని ఆకులమన్నాడు, కంచాకోడూరు గ్రామాల్లో సోమవారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆకులమన్నాడు శివారు కప్పలదొడ్డిపాలెంలో సర్పంచ్ మహ్మద్ రఫీ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో మల్లవోలు పీహెచ్‌సి వైద్యాధికారి కె.మీనా దేవి బృందం రోగులకు పలు పరీక్షలు నిర్వహించారు. కంచాకోడూరులో డాక్టర్ తరుణ్ శంకర్ బృందం రోగులకు పరీక్షలు నిర్వహించారు.

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన



చల్లపల్లి: మండల పరిధిలోని రామానగరంలో కొలువై ఉన్న గంగానమ్మ ఆలయం వద్ద సోమవారం రాత్రి ప్రదర్శించిన మురళీ కోలాటం కట్టుకుంది. ఉయ్యూరు మండలం నమితాలగుంటకు చెందిన 100 మంది కోలాట సభ్యుల బృంధం పదర్శన ఆద్యంతం ప్రేక్షకులను కట్టిపడేసింది.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

పెడన: ఆరోగ్యవంతులుగా ఉండాలంటే తప్పనిసరిగా క్రమం తప్పకుండా బలవర్థకమైన పౌష్టికాహారం తీసుకోవాలని సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ అన్నారు. స్థానిక 8వ వార్డు గున్నాలపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మహోత్సవాల కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సీడీపీవో సముద్రవేణి, సూపర్‌వైజర్ కల్పవల్లి తదితరులున్నారు.

నిత్యాన్నదాన పథకంకు రూ. 50,116 విరాళం



మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించే నిత్యన్నదాన పథకానికి ఎన్టీఆర్ జిల్లా మైలవరం వాస్తవ్యులు చింతపల్లి రామగోపాలరావు మంగళవారం రూ. 50,116 విరాళంగా అందించారు. ఉదయం ఆలయంకు విచ్చేసిన ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అనంతరం ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాద రావును కలసి ఈ విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా దాతను ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ సూపరిటెండెంట్ అచ్యుత మధుసూధనరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. భక్తులతో మోపిదేవి ఆలయం కళకళలాడింది.

అడితి భాస్కరరావు నేత్రాలు దానం

నాగాయలంక: గ్రామంలోని ఒకటో వార్డుకు చెందిన తలశిల భాస్కరరావు(78) అలియాస్ అడితి భాస్కరరావు అనారోగ్యంతో మంగళవారం మరణించగా ఆయన నేత్రాలను విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. తన తండ్రి నేత్రాలను దానం చేయడం ద్వారా మరో ఇద్దరికి చూపు వచ్చే అవకాశం కల్పించాలనే సంకల్పంతో ఆయన కుమారుడు తలశిల గోపి, కుమార్తె ఉప్పల సరోజ ఇతర కుటుంబ సభ్యులు స్వచ్ఛంద నేత్ర దానానికి ముందు కొచ్చారు. స్థానిక మోటివేటర్స్ తలశిల రఘుశేఖర్, కె.వెంకటనారాయణ సహకారంతో కంటి ఆసుపత్రి ఐ టెక్నిషియన్ మహేష్ వచ్చి మృతుడి నేత్రాల నుంచి కార్నియాలను సేకరించి తీసుకువెళ్లారు.

మళ్లీ పెరిగిన వరద

అవనిగడ్డ: దివిసీమకు వరద ఉధృతి మళ్ళీ పెరిగింది. మంగళవారం పులిగడ్డ వద్ద వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆక్విడెక్టును తాకుతూ వరద నీరు దిగువకు వెళుతోంది. మండల పరిధిలోని ఎడ్లలంకలో పడవ ద్వారానే గ్రామస్తులు రాకపోకలు సాగిస్తున్నారు.

ఉచితంగా కంటి పరీక్షలు

తాడేపల్లి(ఘంటసాల): తాడేపల్లి ఆశ్రమంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని, ఉచిత కంటి పొర శస్త్ర చికిత్స సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. సుమారు 75 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా కంటి పొర చికిత్సకు 18 మందిని ఎంపిక చేయగా, చెన్నై నేత్రాలయానికి 18 మందిని పంపనున్నట్లు తెలిపారు. నిర్వాహకులు సూరపనేని వెంకట్రావు, పొట్లూరి అజయ్ కుమార్, హనుమానుల కుమార్, గొర్రెపాటి పద్మజ, ఆశ్రమ ప్రతినిధులు కావూరి కోదండ రామయ్య, మొవ్వ శ్రీరామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకారంలో విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ




కోడూరు కనకదుర్గమ్మ అమ్మవారికి గాయత్రీదేవి అలంకారం



గాయత్రీదేవి అలంకరణలో పెడన పైడమ్మ అమ్మవారు



కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో గాయత్రీదేవి



లక్ష్మీపురంలో గాయత్రి దేవిగా దర్శనమిస్తున్న దుర్గాపార్వతి



ఉరివిలో కాశీఅన్నపూర్ణాదేవిగా అమ్మవారు



పెదకళ్లేపల్లిలో కామాక్షి స్వరూపిణిగా దర్శనమిచ్చిన దుర్గామాత

జగజ్జననీ.. పాహిమాం..



కృష్ణానదితీరంలో కనకదుర్గమ్మ పీఠం వద్ద పూజలు చేస్తున్న దృశ్యం

కోడూరు: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. మంగళవారం అమ్మవార్లు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కోడూరులోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో మహిళలచే సామూహిక కుంకుమార్చన భక్తిశ్రద్ధతో నిర్వహించారు. కనకదుర్గమ్మను గాయత్రీదేవిగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. వంతెన సెంటర్‌లోని గంగాభవాని, విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ, కోడూరు దానాశక్తి, మందపాకల నాంచారమ్మ అమ్మవార్లను కూడా గాయత్రీదేవిగా అలంకరించారు. విశేష అలంకారాల్లో ఉన్న అమ్మవార్లకు ప్రధానార్చకులు ప్రత్యేక పూజలు చేయగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మాచవరం తుంగపల్లెమ్మ, లింగారెడ్డిపాలెం బాలాత్రిపుర సుందరీదేవి, హంసలదీవి కాశీ అన్నపూర్ణ , ఉల్లిపాలెం రాజ్యలక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక అలంకారాలు చేశారు. నరసింహపురంలో నెలకొల్పిన కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహం వద్ద సామూహిక కుంకుమార్చనను భక్తిప్రపత్తులతో జరిపారు.

పెదకళ్లేపల్లి(మోపిదేవి): దక్షిణకాశీగా పేరుగాంచిన పెదకళ్లేపల్లిలో వేంచేసియున్న దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాద రావు ఆధ్వర్యంలో మంగళవారం కామాక్షి స్వరూపిణిగా దుర్గాదేవిని అలంకరించారు. కొక్కిలిగడ్డ శ్రీ గంగా భ్రమరాంబ అమ్మవారు, కొత్తపాలెంలో దుర్గా కోటేశ్వరస్వామివారి ఆలయంలోనూ దుర్గామాత గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు.

మచిలీపట్నంటౌన్: రాబర్ట్‌సన్‌పేటలో వేంచేసి ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయంలో పర్వత వర్ధిని రాజరాజేశ్వరి అమ్మవారికి దివ్వెల నాగవెంకట ప్రసన్నకుమార్ దంపతులు కుంకుమార్చన నిర్వహించారు. ఆజాద్ రోడ్‌లోని కన్యకా పరమేశ్వరీ దేవస్థానంలో కన్యకా పరమేశ్వరీదేవిఆది లక్ష్మీదేవిగా, పార్వతీదేవి గాయత్రీదేవి అలంకారాలతో దర్శనమిచ్చారు. బాలాత్రిపురసుందరి నృత్య నికేతన్ కళాకారులు ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకుంది. పూజా కార్యక్రమాలను ఆలయ అధ్యక్ష కార్యదర్శులు మామిడి మురళికృష్ణ, మోటమర్రి బాబాప్రసాద్ పర్యవేక్షించారు. బుట్టాయిపేటలోని దత్తాశ్రమంలో అమ్మవారు శ్రీ బాలాత్రిపుర సుందరీదేవిగా, రాజుపేటలోని శ్రీ భ్రమరాంబ సమేత రాజమౌళేశ్వర స్వామి ముచ్చం గుడిలో అమ్మవారు అన్నపూర్ణా దేవిగా దర్శనమిచ్చారు. రేవతి సెంటర్లోని గంగానమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారు శ్రీ గాయత్రీ దేవిగా దర్శనమిచ్చారు.



పెడన శ్రీకన్యకాపరమేశ్వరి దేవి ఆలయం తీర్థపు బిందె ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

పెడన: మండల పరిధిలోని ఉరివి గ్రామంలో వేంచేసి ఉన్న గంగాపార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలోని అమ్మవారిని మంగళవారం కాశీఅన్నపూర్ణాదేవిగా అలంకరించారు. అమ్మవారి అలంకరణకు బాయిరెడ్డి బసవయ్య మనవడు శివప్రసాద్ దంపతులు దాతలుగా ఉన్నారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. పైడమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని రెండో రోజు గాయత్రీదేవిగా అలంకరించారు. కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. లలితాపారాయణం, సౌందర్యలహరి పఠనం గావించారు.

చల్లపల్లి: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా మండల పరిధిలోని లక్ష్మీపురంలో వేంచేసియున్న దుర్గాపార్వతి సహిత సోమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు బాలసుబ్రహ్మణ్యం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నాగాయలంక: గ్రామంలోని ప్రసిద్ధ పార్వతీ సమేత కన్యకాపరమేశ్వరీ సమన్విత నగరేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం పార్వతీ అమ్మవారిని గాయత్రిదేవి, వాసవీ కన్యాకాంబ అన్నపూర్ణదేవి అలంకారంలో భక్తులకు దర్శమిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివ రావు పర్యవేక్షణలో అర్చకుడు కొల్లిపర సుబ్బారావు బ్రహ్మత్వంలో ప్రధాన కలశ పీఠం వద్ద మునగాల కుటుంబరావు-తేజశ్రీ దంపతులు ఉత్సవ నిత్య పూజ, యాగశాలలో గాయత్రీ హోమం జరిపారు. శ్రీరామ పాదక్షేత్రం సముదాయంలోని శ్రీకనక దుర్గమ్మ దేవస్థానంలో అమ్మవారిని మంగళవారం గాయత్రీదేవి విశేష అలంకారంలో భక్తులు దర్శనం చేసుకున్నారు.

కృత్తివెన్ను: శ్రీదేవీశరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని కృత్తివెన్ను శివాలయంలో అమ్మవారు ధనలక్ష్మీ దేవిగాను అడ్డపర్ర, నీలిపూడి, గరిశపూడి తదితర గ్రామాలలో గాయత్రీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయాల్లో భక్తులు, ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు.

గూడూరు: తరకటూరులోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో వేదమాత గాయత్రీ దేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, మహాలక్ష్మి అమ్మవారి ఆలయాల్లో అమ్మవారిని అన్నపూర్ణా దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామన్నపేట, నారికేడాలపాలెం, గూడూరు గాంధీ బొమ్మ సెంటరు, ద్వారకా నగర్ రామాలయం, ఐదుగుళ్లపల్లి శివాలయాల్లో అమ్మవారు గాయత్రీ దేవి రూపంలో దర్శనమిచ్చి పూజలందుకున్నారు.

బంటుమిల్లి: కనకదుర్గనగర్‌లో కొలువై ఉన్న కనక దుర్గ ఆలయం, పోశ్నాపురం శ్రీసువర్చలాంజనేయస్వామి ఆలయంలో అమ్మవారిని గాయత్రీదేవీగాను, పెదతుమ్మిడి శివాలయంలో అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవీగా భక్తుల పూజలు అందుకున్నారు. సీతారామచంద్రస్వామి, పద్మావతి, గోదా సమేత వెంకటేశ్వరస్వామి, మల్లేశ్వరం కోదండరామాలయంల్లో అమ్మవార్లను శ్రీధాన్యలక్ష్మీదేవీలుగా అలంకరించి సామూహిక కుంకుమ పూజలు చేశారు.

అవనిగడ్డ: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని అవనిగడ్డ మండల పరిధిలోని పలు ఆలయాల్లో గాయత్రీ దేవి ఆలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక రాజశేఖర స్వామి ఆలయం, లంకమ్మ అమ్మవారి ఆలయం, పులిగడ్డ కనకదుర్గ ఆలయంలో అమ్మవారు గాయత్రి దేవిగా దర్శనమివ్వగా భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు.

ఘంటసాల: బాలపార్వతీ సమేత జలధీశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు చావలి కృష్ణ కిషోర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మంగళవారం రెండో రోజు అమ్మవారు గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



కొక్కిలిగడ్డలో గాయత్రి దేవిగా అమ్మవారు



నీలిపూడిలో గాయత్రీదేవిగా అమ్మవారు



కృత్తివెన్ను శివాలయంలో ధనలక్ష్మీదేవిగా అమ్మవారు.



నాగాయలంక నగరేశ్వరుని దేవస్థానంలో గాయత్రి దేవి



గాయత్రీదేవిగా కోడూరు గంగాభవానీ అమ్మవారు

ప్రభుత్వ దృష్టికి బధిరుల సమస్యలు

చిలకలపూడి(మచిలీపట్నం): బధిరుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులశాఖ సంచాలకులు బి.రవిప్రకాష్ రెడ్డి తెలిపారు. బధిరుల దినోత్సవం సందర్భంగా వికలాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో స్థానిక వాకర్స్ అసోసియేషన్ హాల్లో మంగళవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రవిప్రకాష్‌రెడ్డి మాట్లాడారు. తొమ్మిది మంది బధిరులకు టచ్‌ఫోన్లు, 10 మంది వృద్ధులకు వినికిడి యంత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమశాఖ ఏడీ వి. కామరాజు తదితరులు పాల్గొన్నారు.



బధిరులకు టచ్ ఫోన్లు అందజేసిన రవిప్రకాష్ రెడ్డి, డీఆర్వో చంద్రశేఖర్ తదితరులు

ఘనంగా పూర్వ విద్యార్థుల కలయిక



నోబుల్ కళాశాలలో 47 సంవత్సరాల క్రితం చదువుకున్న పూర్వ విద్యార్థులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని నోబుల్ కళాశాలలో 1978–80 సంవత్సరాల మధ్య ఇంటర్మీడియెట్, 1980–83 సంవత్సరాల మధ్య డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం కలుసుకున్నారు. 47 సంవత్సరాల క్రితం కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు కళాశాల ఆవరణలో కలుసుకొని ప్రేమపూర్వకంగా పలకరించుకుని ఆనందోత్సాహాలతో గత స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. ఈ బ్యాచ్‌లోనే చదివి ప్రస్తుతం కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎస్ జె ఎర్నెస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న దాదాపు 50 మంది పూర్వ విద్యార్థులు వారి స్నేహితులతో సరదాగా గడిపారు. ఈనెల 30వ తేదీతో ప్రిన్సిపాల్‌గా ఉద్యోగ విరమణ చేస్తున్న ఎర్నెస్ట్‌ను ఆయన స్నేహితులు సత్కరించారు. పూర్వ విద్యార్థులు జయరాజు, వేణుబాబు, జాషువా, వైజయంతి, స్వరూప, కోటేశ్వరరావు, బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని అలెగ్జాండర్, జేమ్స్‌లు పర్యవేక్షించారు. ప్రతి ఒక్కరికి నోబుల్ కళాశాల లోగోతో కూడిన జ్ఞాపకను ప్రిన్సిపల్ ఎర్నెస్ట్ అందజేశారు.

మానవత్వానికి మాయనిమచ్చ

పెడన: మండల పరిధిలోని నందిగామ గ్రామంలో రెండు రోజులు కిందట జరిగిన ఎస్టీకి చెందిన వృద్ధుడు రాంబాబు అంత్యక్రియలను అడ్డుకోవడం వంటి ఘటనలు మానవత్వానికి మాయనిమచ్చగా మిగులుతాయని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ బాబు అన్నారు. మంగళవారం ఆయన రాంబాబు కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రాంబాబు ఈ నెల 21న మరణించగా గ్రామంలో ఏడు శ్మశాన వాటికల్లో ఒక్కచోట కూడా అంత్యక్రియలకు అనుమతి ఇవ్వకుండా అడ్డుకోవడం అత్యంత అవమానవీయ ఘటన అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి వ్యక్తిలో భగవంతుడు ఉంటాడనే కనీసం జ్ఞానం, చనిపోయిన వారు భగవంతునితో సమానం అనే భావం లేకుండా మరణించిన వారి అంత్యక్రియలను అడ్డుకోవడం అంటే దైవకార్యాన్ని నిరోధించడమేనని తెలిపారు. ఇలాంటి సంఘటనలు గ్రామాలకు చెడ్డ పేరు తెస్తాయన్నారు. గ్రామానికి చెందిన రైతు యర్రంశెట్టి లక్ష్మయ్య(తాతయ్య) చొరవ తీసుకొని తన సొంత స్థలంలో రాంబాబు అత్యక్రియలకు అనుమతి ఇచ్చి తన మానవత్వం, దయాగుణాన్ని చాటుకున్నారని కొనియాడారు. లక్ష్మయ్య పలువురికి స్ఫూర్తిదాయకంగా అందరికి ఆదర్శంగా నిలిచారన్నారు. నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు కుంభా లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి దేవరకొండ వసంత్, నాయకులు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు విడుదల చేయాలి

పెడన: రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలను తక్షణం విడుదల చేసి డిగ్రీ కళాశాలలను ఆదుకోవాలని కళాశాలల సంఘ జిల్లా కార్యదర్శి కె. జ్యోతిరాజు డిమాండ్ చేశారు. మంగళవారం డిగ్రీ కళాశాలలు బంద్ రెండో రోజు కూడా కొనసాగింది. స్థానిక విజయానంద డిగ్రీ కళాశాల ఎదుట కళాశాల సిబ్బందితో కలిసి ఆయన నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు డిగ్రీ కళాశాలలు యాజమాన్య సంఘం ఇచ్చిన పిలుపు మేరకు బంద్ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంటు సకాలంలో విడుదల చేయని కారణంగా ఆయా కళాశాలలు నిర్వహణ ఆగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలల యాజమాన్యాలు అనేక ఇబ్బందులకు గురికాకుండా తక్షణం ఫీజు రీయింబర్స్‌మెంటును విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మధుసూదనరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

28న ఉచిత మెగా వైద్య శిబిరం

అవనిగడ్డ: ఈ నెల 28వ తేదీన మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు వర్థంతి సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండలి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి మండలి వెంకట్రామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీక్షేత్రంలో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో విజయవాడ పెద్దేశ్వర్ హెల్త్‌కేర్ సెంటర్ వైద్యశాలకు చెందిన వైద్యులు గుండె, కిడ్నీ, ఊపిరితిత్తులు, ఈఎన్‌టీ, దంత, ఎముకలు, నరాలు, గ్యాస్, లివర్ సంబంధిత సమస్యలకు పరీక్షలు ఉచితంగా చేసి అవసరమైన మందులు అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉత్సాహంగా తాళం భజన పోటీలు

చిట్టూర్పు(ఘంటసాల): గ్రామంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో నిర్వహిస్తున్న కృష్ణా, ఎన్టీఆర్, నెల్లూరు జిల్లాల స్థాయి తాళం భజన పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా రెండో రోజు మంగళవారం బోగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన శ్రీ నాగసాయి మహిళా భజన సమాజం, యండకుదురు గ్రామానికి చెందిన శ్రీ గీతా భక్త సమాజం, పెదకళ్లేపల్లి గ్రామానికి చెందిన శ్రీ సీతారామ చంద్రమౌళి భజన సమాజం వారు ప్రదర్శన నిర్వహించారు.

మెరుగైన సేవలు అందించాలి

కృత్తివెన్ను: వైద్యాధికారులు, సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ తెలిపారు. మండలంలోని పల్లెపాలెం పంచాయతీలో గత వారం రోజులుగా జ్వరపీడితులు సంఖ్య పెరగడంతో మంగళవారం ఆయన స్థానిక వైద్యులతో కలసి గ్రామాన్ని సందర్శించారు. ప్రస్తుతం జ్వరాలు అదుపులోనే ఉన్నాయని, ప్రతిరోజు తమ సిబ్బందితో పాటు తాము కూడా గృహసందర్శన చేస్తూ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నామని వైద్యులు హేమ, సంతోష్ కుమార్ ఎంపీపీకి తెలిపారు. దీనిపై ఎంపీపీ మాట్లాడుతూ జ్వరాలు పూర్తిగా అదుపులోకి వచ్చేవరకు గ్రామంలో వైద్యశిబిరాన్ని కొనసాగించాలని, రక్తనమూనాలు సేకరించి పరీక్షలు చేయాలని సూచించారు. ఎంపీటీసీ కొల్లాటి కృష్ణ ఉన్నారు.

ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం



మచిలీపట్నంటౌన్: నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలో వేంచేసి ఉన్న పర్వత వర్ధిని రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తల మండలి నూతన పాలకవర్గ సభ్యులు మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో దేవదాయ ధర్మాదాయ శాఖ మచిలీపట్నం డివిజన్ తనిఖీ అధికారి కగ్గా శ్రీనివాస్ 11 మంది సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ నూతన పాలకవర్గ చైర్మన్‌గా దేసు నీరజను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. .

హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌తో క్యాన్సర్‌కు అడ్డుకట్ట

కోనేరుసెంటర్: మహిళలకు కొన్ని రకాల క్యాన్సర్‌లు రాకుండా హెచ్‌పీవీ వాక్సినేషన్ ద్వారా అడ్డుకట్ట వేయవచ్చని ప్రముఖ గైనకాలజి నిపుణులు డాక్టర్ సాహితీ తెలిపారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఉమెన్ ఎంపవర్‌మెంట్ విభాగం ఆధ్వర్యములో మంగళవారం క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు వాక్సినేషన్ వేయించుకోవడం ద్వారా పలు రకాల క్యాన్సర్‌లు బారిన పడకుండా కాపాడుకోవచ్చన్నారు. సమన్వయకర్త డాక్టర్ ఎల్. సుశీల అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రెక్టర్ ఆచార్య ఎంవీ బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. ఉష, ఆచార్య మారుతి, సహాయ ఆచార్యులు డాక్టర్ సుజాత, స్టాఫ్ నర్స్ పద్మజ పాల్గొన్నారు.

ఎఫ్ఎన్ఓకు పరామర్శ

మచిలీపట్నం అర్బన్: స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఎఫ్ఎన్ఓగా పనిచేస్తున్న మహిళా ఉద్యోగి పీత దుర్గ సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని మంగళవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కిష్టమూర్తి (కిట్టు), మహిళా కార్పొరేటర్లు పరామర్శించి ధైర్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీకి సానుభూతిపరులుగా పేరున్న కారణంతో అధికారపక్షానికి దగ్గరగా ఉన్న కొంతమంది ఎన్టీఆర్ వైద్య సేవ ఉద్యోగుల చేత పీత దుర్గతో సహా మహిళా సిబ్బంది తరచూ అవమానాలు, వేధింపులు ఎదుర్కొంటున్నారని ఆరోపణలు వెలువడుతున్నాయి. ఈ వేధింపులను భరించలేక పీత దుర్గ ఆత్మహత్యాయత్నానికి దిగినట్లు బాధితురాలు చెబుతుంది. కాగా ఈ పరిణామంపై ఆగ్రహం వ్యక్తం చేసిన మరో ఐదుగురు మహిళా ఎఫ్ఎన్‌ఓలు సంఘీభావంగా తమ పదవులకు రాజీనామాలు సమర్పించారు. ఆసుపత్రిలో వేధింపులపై ఉన్నతాధికారులు దర్యాప్తు చేసి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

యువకుడిపై కేసు నమోదు

కోనేరుసెంటర్: మైనర్‌కు మాయమాటలు చెప్పి వివాహం చేసుకున్న యువకుడిపై ఇనగుదురుపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. మచిలీపట్నం రాజుపేటకు చెందిన మైనర్ నేషనల్ కళాశాలలో చదువుకుంటుంది. అదే ప్రాంతానికి చెందిన మామిడి లోకేష్ మణికంఠ అనే యువకుడు ప్రేమ పేరుతో ఆమెకు మాయమాటలు ఈ నెల 22వ తేదీన బయటికి తీసుకెళ్లాడు. ఆమెను వివాహం చేసుకుని లైంగికదాడికి పాల్పడ్డాడు. యువతి కనిపించకపోవటంతో తల్లి కుమారి ఇనగుదురుపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి మణికంఠను అదుపులోకి తీసుకున్నారు. ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి మైనర్‌ను కుటుంబసభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ భూమిలో నిర్మాణం నిలిపివేయాలి

కృత్తివెన్ను: మండల పరిధిలోని పడతడిక గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మిస్తున్న సిమెంటు ఇటుకల తయారీ కంపెనీని వెంటనే నిలుపుదల చేయాలని గ్రామ సర్పంచ్ మందపాటి ప్రదీప్ కోరారు. దీనిపై ఆయన మీ కోసంలో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై సర్పంచ్ విలేకర్లతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన కొమరిపాలెం మహేష్ అనే వ్యక్తి ప్రభుత్వ భూమి ఆర్ఎస్ నెం: 18 ని ఆక్రమించి రోడ్డు మార్జిన్‌లో మురుగు డ్రెయిన్‌ను పూడ్చి వేసి కంపెనీ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీని వల్ల ఎదురుగా ఉన్న వైఎస్సార్ కాలనీలో ప్రజల ఆరోగ్యంతో పాటు, ఆక్వా చెరువుల మురుగునీటికి తీవ్ర ఇబ్బందులు ఉన్నాయన్నారు. అధికారులు స్పందించి వెంటనే దీన్ని నిర్మాణాన్ని నిలుపుదల చేసి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

అవనిగడ్డ: నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన ఏడుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆందజేశారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో రూ.12,01,377 సహాయాన్ని చెక్కులు, ఎల్‌ఓసిలు రూపంలో అందజేశారు.